క్లుప్తంగా

క్రీడాకారునికి ఆర్థిక సాయం



నున్న(విజయవాడరూరల్): ఖమ్మంకు చెందిన బొడ్డుపల్లి గౌతమ్ వచ్చే నెల ఒకటో తేదీన నేపాల్‌లో జరిగే కబడ్డీ పోటీలకు అండర్-17 కబడ్డీ ఛాంపియన్‌షిప్ విభాగంలో దేశం తరపున ఎంపికయ్యాడు. పేదకుటుంబానికి చెందిన గౌతమ్‌ను నున్న గ్రామంలోని శాలివాహనులు శనివారం అతన్ని సన్మానించి రూ. 20 వేల సాయం అందజేశారు. క్రీడల్లో రాణించి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ ఐలపురం వెంకయ్య ఆధ్వర్యంలో బొమ్మిన శ్రీనివాసరావు, భర్తవరపు దుర్గాప్రసాద్, డీఎస్ఎన్ మూర్తి, బొమ్మిన రవికుమార్, ఎన్ నాని, వై శివ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సూచిక బోర్డుల ఏర్పాటు



కంకిపాడు: ప్రమాదాల నివారణకు మేము సైతం అంటూ లియో క్లబ్ ప్రతినిధులు ముందుకువచ్చారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు, ఉయ్ ఫర్ ఛేంజ్ లియో క్లబ్ ప్రతినిధులు విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై రహదారి సూచికలను శనివారం ఏర్పాటు చేశారు. పునాదిపాడు బైపాస్ వెళ్లడానికి అక్కడ ఎలాంటి సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతుండటం, సూచిక బోర్డులతో సమస్య పరిష్కారం అవుతుందని గుర్తించిన క్లబ్ ప్రతినిధులు వాటిని ఏర్పాటుచేశారు. రీజియన్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, లియో సభ్యులు రవితేజ, మనోహర్, వి.మనోహర్, ప్రసాద్, అరుణ్‌సుభాష్ పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో ఉచిత శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ. పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేది నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులు అర్హులుగా పేర్కొన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు 9494005725 నెంబర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో సోమవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి డెంటల్ కేర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

20 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 20వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు తెలుపుతూ... ఈనెల 20, 21వ తేదీల్లో ప్రొద్దుటూరు జిల్లా పరిషత్, కోలవెన్ను జిల్లా పరిషత్, నెప్పల్లి జిల్లా పరిషత్ స్కూల్, తెన్నేరు జెడ్పీ హైస్కూల్ లోనూ, 22, 23, 24వ తేదీల్లో ప్రొద్దుటూరు సచివాలయం, కోలవెన్ను పంచాయతీ కార్యాలయం, కుందేరు గ్రామ పంచాయతీ, తెన్నేరు పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఉపాధ్యాయ రత్న, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సరేజనాసుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8వ తేదీన ప్రముఖుల చేతులమీదుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులను పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు వారు అందిస్తున్న సేవల వివరాల తో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కోల్‌కతా ఘటనపై వైద్య విద్యార్థుల నిరసన

- లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- వైద్యులు, వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలని డిమాండ్



నిరసన ప్రదర్శన చేస్తున్న పశువైద్య విద్యార్థులు

గన్నవరం: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక బుద్దవరం రోడ్డులోని కళాశాల క్లినికల్ కాంప్లెక్స్ నుంచి వెటర్నరీ విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో జాతీయ రహదారిపై మానవహారంగా నిలబడి నిరసన తెలియజేశారు. వైద్యులు, వైద్య విద్యార్థుల రక్షణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని, కోల్‌కతా ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు సుస్మిత, భానుప్రకాశ్, వర్మ, గణపతిరావు మాట్లాడుతూ... వైద్యులపై దాడులు, అత్యాచారాలు జరగడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ విద్యార్థులు కళాశాలలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ రాధిక పాల్గొన్నారు.



గన్నవరంలో విద్యార్థుల మానవహారం



చిన అవుటపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

చిన అవుటపల్లిలో

గన్నవరం రూరల్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అమానుషమైన దాడి, అత్యాచారం, హత్య ఘటనను ఖండిస్తూ వైద్యులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ వైద్య కళాశాల విద్యార్థులు, పీజీలు కళాశాల నుంచి ప్రదర్శనగా బయలుదేరి ముఖద్వారం వద్ద నిరసన తెలిపారు. న్యాయం జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లపై అరాచకాలు అరికట్టాలని, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

కంకిపాడులో నిలిచిపోయిన ఓపీ సేవలు



కంకిపాడు సీహెచ్‌సీలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

కంకిపాడు: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య సేవలు నిలుపుదల చేశారు. వైద్యురాలిపై దుశ్చర్యను నిరసిస్తూ వైద్య సిబ్బంది సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన చేశారు. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ పెద్ద పెత్తున నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు, సిబ్బంది ఓపీ సేవలను నిలిపివేసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్వాసులు, డాక్టర్ దుర్గ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ ధనూష, పీజీ వైద్యులు అభిషేక్, మధురిక, సురేందర్, పర్వీన్, సౌజన్య, శ్రీలత, హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్‌లో ఆస్పత్రులు బంద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు హనుమాన్‌జంక్షన్‌లో శనివారం ఆస్పత్రులు బంద్ పాటించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లు వైద్య సేవలు నిలిపివేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎంపీ వైద్యులు కూడా ప్రాథమిక చికిత్స కేంద్రాలను మూసి వేసి ఐఎంఏ బంద్‌కు సంఘీభావం తెలిపారు.

మానవత సభ్యుల శాంతి ర్యాలీ



హనుమాన్‌జంక్షన్‌లో మానవత సభ్యుల శాంతి ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ జెండా ఊపి శాంతి ర్యాలీ ప్రారంభించారు. అధిక సంఖ్యలో మానవత సభ్యులు ర్యాలీకి హాజరై ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జంక్షన్ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి, మెయిన్‌సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత కేంద్ర కమిటీ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, సీనియర్ సభ్యులు పాట్రోలు గణేష్, గంటా సత్యనారాయణ, ఇందిరా దేవి, జన్యావుల సత్యనారాయణ, పొట్లూరి శేషాచలం, వడ్డీ రాజేశ్వరరావు, నారగాని కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులకు విశేష పూజలు



అంకురార్పణ చేస్తున్న పండితులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని శ్రీభూదేవీసమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఏటా శ్రావణమాసంలో పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. తొలి రోజు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలతో స్వామివారి పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆగమ పండితుల నేతృత్వంలో కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి సన్నిధిలో ప్రార్థనా సూక్తం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, అంకురారోహణాదులు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఏడాది పొడవునా స్వామి సన్నిధిలో తెలిసి తెలియక ఏదైనా పొరపాటు జరిగినా, రాకూడని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినా అపచారం జరుగుతుందన్నారు. వాటికి ప్రాయశ్చితం చేసేందుకు ఏటా శ్రావణమాసంలో స్వామివారి సన్నిధిలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తామన్నారు. దీంతో స్వామివారి శక్తి మరింత ద్విగిణీకృతమవుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలోని ఇతర ఉపాలయాల్లోనూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆరుగురు జూదరులపై కేసు

పెనమలూరు: కానూరులో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 6,900 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు

బస్సు ఢీకొని యువకుడు మృతి



కంకిపాడు: బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ తాతాచార్యులు తెలిపిన కథనం మేరకు... మండలంలోని ఈడుపుగల్లు బీసీ కాలనీకి చెందిన షేక్ బాజీ (24) కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి గంగూరు నుంచి బిర్యానీ తీసుకుని బైక్‌పై స్వగ్రామమైన ఈడుపుగల్లు వస్తుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఘటనలో బైక్ నడుపుతున్న బాజీ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ తాతాచార్యులు తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

డీఎస్పీ శ్రీనివాసరావు



ఆత్కూరులో ఎస్ఐలతో సమీక్ష నిర్వహిస్తున్న గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు

ఉంగుటూరు: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు ఎస్ఐలకు సూచించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలకు నేర సమీక్ష సమావేశాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. చెడు నడత గలవారిపై నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా ఉండేందుకు రాత్రిళ్లు గస్తీని ముమ్మరం చేయాలని చెప్పారు. పాత నేరస్తుల కదలికలను గమనించి క్రమం తప్పకుండా బైండోవర్ చేయాలని ఆదేశించారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో హనుమాన్‌జంక్షన్ సీఐ కె.సత్యనారాయణ, హనుమాన్‌జంక్షన్, ఆత్కూరు, వీరవల్లి ఎస్ఐలు ఏడీఎల్ జనార్ధన్, సురేష్ చావా, ఎం.చిరంజీవి పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు



వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: ప్రసాదంపాడు గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 90, 40వేల లీటర్ల వాటర్ ట్యాంకులతో పాటు రైవస్, ఏలూరు, బుడమేరు కాల్వగట్ట ప్రాంతాల్లో సుమారు 9 మోటారు బోర్ల సాయంతో తాగునీటిని అందిస్తున్నామన్నారు. నూతన పైప్‌లైన్ల ఏర్పాటు, పాతవి మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వాటర్ ట్యాంకుల లోపల బ్లీచింగ్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాపై సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

దాతల సహకారంతో లక్ష్య సాధన



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సుబ్రహ్మణ్యం, ప్రకాశరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలతో విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని విశ్రాంత డీసీటీఓ ఎం. సుబ్రహ్మణ్యం, సీనియర్ న్యాయవాది ప్రకాశరావు అన్నారు. చెన్నైకు చెందిన ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ వి.రత్నరాజు, హైదరాబాద్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి జానకి షర్మిల దంపతుల కుమార్తె రామస్నిగ్ధ జ్ఞాపకార్థం విద్యార్థులకు సుమారు రూ. 60వేలు విలువ చేసే నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్‌లో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సుబ్రహ్మణ్యం, ప్రకాశరావు నోట్ పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకుండా దాతలు అందిస్తున్న చేయూతతో విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి సమాజాభివృద్ధికి దోహదపడుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులు పేద విద్యార్థులకు తమవంతు సాయం అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలన్నారు. అప్పుడే గతంలో తాము దాతల సాయంతో చేరుకున్న ఉన్నత స్థాయికి సార్థకత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, ఎం నరసింహారావు, నాగేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తరుణ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యూనియన్ జెండాను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికి నివేశన స్థలాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు ధనియాల అప్పారావును సత్కరించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాల సందర్శించిన ఎమ్మెల్యే

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం సందర్శించారు. కళాశాల పరిసరాలను పరిశీలించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. తహసీల్దారు శివయ్య, పలువురు కళాశాల అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్యాంజలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు చెన్నైకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి ఘటించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణులు భరతనాట్యంతో భక్తులను అలరించారు. మైత్రి సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ (చెన్నై) సంస్థకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి అంశంతో ప్రారంభించి 'శివోహం', 'ఆనంద నటన ప్రకాశం', 'గోవిందం', 'దేవి - మాతృ సమర్పణం' అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు. వారి అద్భుత నాట్యంతో భక్తులు తన్మయులై హర్షధ్వానాలు చేశారు.

నేడు రోటరీ మిడ్‌టౌన్ మెగా లోన్ మేళా

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని హోటల్ వివంతలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ లోన్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో లోన్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గుడిపాటి కిషోర్, లోన్‌మేళా చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సామాన్య ప్రజలకు రుణాలపై అవగాహన కలిగించడానికి లోన్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 25 బ్యాంకుల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎడ్యుకేషన్, హౌసింగ్, మార్టిగేజ్, ఎంఎస్ఎంఈ రుణాలపై వివరాలు తెలుసుకోవచ్చన్నారు. రోటరీ ప్రతినిధులు సుందర్ రెడ్డి బత్తుల, త్రినాథ్ నందూరి పాల్గొన్నారు.

ఆత్మీయబంధానికి ప్రతీక రక్షాబంధన్

- రేపు రాఖీ పౌర్ణమి
- ఆకట్టుకుంటున్న విభిన్న రాఖీలు
- కళకళలాడుతున్న వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాలు
- ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు
- ఈ ఏడాది బంగారు దుకాణాల్లో వెండి రాఖీలు
- చిన్నారులను అలరిస్తున్న డోరేమాన్, బ్యాట్‌మ్యాన్ రాఖీలు



వివిధ మోడల్స్‌లో వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయిస్తున్న రాఖీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్నా చెల్లెళ్లు.. అక్కా, తమ్ముళ్ల మధ్య ఆత్మీయ బంధానికి చిహ్నంగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకున్నా... మన కోసం అండగా నిలిచే అప్పుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదరభావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. సోదరుడంటే తోడబుట్టిన వాడే కానక్కర్లేదు. చెల్లెమ్మ... నేనున్నానంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణ పౌర్ణమి నాడు రాఖీ పండుగ జరుపుకొంటారు.

జోరందుకున్న అమ్మకాలు

ఈ నెల 19వ తేదీ సోమవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న మోడల్స్‌లో రాఖీలు యువతకు కనువిందు చేస్తున్నాయి. ఈ సారి వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి రాఖీలు వచ్చాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రాఖీలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో ఆయా దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి.

చిన్నారులను ఆకట్టుకుంటున్న రాఖీలు

చిన్నారులకు ఆకట్టుకునేందుకు డోరేమాన్, మోటుపంతులు, మిక్కీమౌస్, హనుమాన్ వంటి బొమ్మలను రాఖీలపై ఏర్పాటు చేయడంతో వాటిని చిన్నారులు ఆసక్తిగా చూసి కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా వాటిని తయారు చేశారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ విస్తృతంగా అమ్మకాలు

దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటికి పలు ఆఫర్లను సైతం అందిస్తున్నాయి. దానికి తోడు వెండితో తయారు చేసిన రాఖీలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎనిమిది వందల నుంచి నాలుగు వేల వరకూ వెండితో తయారు చేసిన రాఖీలు విక్రయిస్తున్నారు. ప్రముఖ బంగారు దుకాణాలు సైతం ఆన్‌లైన్‌లో ఇలాంటి రాఖీలను విక్రయిస్తున్నాయి.

రూ.5 నుంచి రెండు వందల వరకూ ధరలు

రాఖీలు ఐదు నుంచి రెండు వందల రూపాయల వరకూ ధర పలుకుతున్నాయి. అన్ని వర్గాలకు అవసరమైన రాఖీలను వన్‌టౌన్‌లో విక్రయిస్తున్నారు. వీటిని ఆయా రిటైల్ మార్కెట్లలో రెట్టింపు ధరలకు విక్రయిస్తారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్ నుంచి కేవలం విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాకే పరిమితం కాకుండా గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం తదితర జిల్లాల నుంచి కూడా వ్యాపారులు రాఖీలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో రెండు మూడు రోజులుగా రాఖీల వ్యాపారం వన్‌టౌన్‌లో జోరుగా సాగుతోంది.

దాడి ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: దాడి ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... కంకిపాడు పట్టణానికి చెందిన గుమ్మడి రవికిరణ్, పెన్నేరు రాఘవ అలియాస్ ముసలయ్య ఈనెల 16న బస్టాండు సెంటరులో మాట్లాడుకుంటుండగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ముసలయ్య సైకిల్ గాలి పంపుతో రవికిరణ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో రవికిరణ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడు రవికిరణ్ తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.